www.eenadupratibha.net

# BOARD OF SECONDARY EDUCATION (AP)
## SUMMATIVE ASSESSMENT – I
## TENTH CLASS TELUGU MODEL PAPER
## PAPER - I

సమయం: 2 గం.45 ని. పార్టు A & B గరిష్ఠ మార్కులు: 40

సూచనలు:

1) ప్రశ్నపత్రంలో పార్టు – A, B అనే రెండు విభాగాలు ఉంటాయి.
2) పరీక్ష ప్రారంభంలోనే పార్టు – A తోపాటు పార్టు – B కూడా ఇస్తారు.
3) ప్రశ్నపత్రం చదువుకోవడానికి 15 నిమిషాలు, జవాబులు రాయడానికి 2 గం. 30 ని. సమయం ఉంటుంది.
4) పార్టు – B సమాధానాలు ప్రశ్నపత్రంలోనే రాయాలి.

సమయం: 2 గంటలు పార్టు – A గరిష్ఠ మార్కులు: 30

**I. అవగాహన – ప్రతిస్పందన (12 మార్కులు)**

1. కింది పద్యాల్లో ఒక దానికి ప్రతి పదార్థం రాయండి. 1 × 4 = 4

అ) సురుచిరతారకాకుసుమశోభి నభోంగణభూమిc గాలమ
న్గరువపుసూత్రధారి జతనంబున దిక్పతికోటి ముందటన్
సరసముగా నటింపcగ నిశాసతి కెత్తిన క్రొత్తతోcపుcబెం
దెర యన నొప్పె సాంధ్యనవదీధితి పశ్చిమదిక్తటంబునన్.

(లేదా)

ఆ) శివరాజంతట మేల్మిసుంగుc దెరలో స్నిగ్ధాంబుదచ్ఛాయలో
నవసౌదామినిc బోలు నా యవనకాంతారత్నమున్ భక్తి గౌ
రవముల్ వాఱcగc జూచి పల్కె "వనితారత్నంబు లీ భవ్యహైం
దవభూజంగమ పుణ్యదేవతలు; మాతా! తప్పు సైరింపుమీ!"

2. కిందివాటిలో ఒక పద్యాన్ని పాద భంగం లేకుండా పూరించి, భావం రాయండి. 1 × 4 = 4

అ) దెసలను కొమ్మలొయ్య......సమత్సుకాకృతిన్

(లేదా)

ఆ) ఆ - యేమీ? యొక.........యౌద్ధత్య మోర్వన్ జుమీ.

కింది పరిచిత గద్యాన్ని చదివి, ప్రశ్నలకు జవాబులు రాయండి. 4 × 1 = 4

అర్థములు నిత్యములు కావు. యౌవనం ఝరీవేగ తుల్యం. జీవనం బుద్బుద ప్రాయం. కాబట్టి బుద్ధిమంతుడు సత్వరముగా ధర్మంను సమాచరింపవలెను. సమాచరింపనివాడు పశ్చాత్తాపం బొంది శోకాగ్ని సంతప్తుడగును. నీవతి సంచయము చేసితివి. దాని దోషమిది. కాబట్టి యతి సంచయేచ్ఛ తగదు. ఒరులకిచ్చి తాను భుజించినదే తన సొత్తు. పరులకీక తానుగుడవక కూడబెట్టిన ద్రవ్యం చచ్చిన తఱి వెంటరాబోదు.

ప్రశ్నలు:

3. బుద్ధిమంతుడు దేన్ని ఆచరించాలి?
4. దేన్ని తనసొత్తుగా భావించాలి?

www.eenadupratibha.net

5. మనిషి మరణించాక వెంటరానిది ఏది?

6. పై పేరా ఆధారంగా ఒక ప్రశ్న తయారు చేయండి.

**II. స్వీయరచన (18 మార్కులు)**

**కింది ప్రశ్నలకు 4 – 5 వాక్యాల్లో జవాబులు రాయండి** **4 × 2 = 8**

7. ధన్యుడు పాఠ్యభాగ రచయిత గురించి మీకు తెలిసిన విషయాలు రాయండి.

8. శివాజీ సోన్‌దేవుని పట్ల ఎందుకు ఆగ్రహంతో ఉన్నాడు? ఏమన్నాడు?

9. వెన్నెల పాఠం నేపథ్యాన్ని రాయండి.

10. కాలం విలువైందని ఎలా చెప్పగలరు?

**కిందివాటిలో ప్రతి విభాగం నుంచి ఒక ప్రశ్నకు 10 – 12 వాక్యాల్లో జవాబులు రాయండి.** **2 × 5 = 10**

11. లోచనంబులకు నమృతసేచనంబును, శరీరంబునకు జందనా సారంబు నందించిన వెన్నెల ఎలా విస్తరించిందో రాయండి.

**(లేదా)**

మాతృభావన పాఠం ఆధారంగా శివాజీ వ్యక్తిత్వాన్ని విశ్లేషించండి.

12. 'పల్లెటూళ్లు ప్రశాంత జీవిత సౌఖ్యానికి పుట్టిళ్లు'. దీన్ని సమర్థిస్తూ రాయండి.

**(లేదా)**

అమరావతి శిల్పకళలకు నిలయమని ఎలా చెప్పవచ్చు?

www.eenadupratibha.net

సమయం: 30 నిమిషాలు | పార్టు – B | మార్కులు: 10

సూచన: పార్టు – Bకి సంబంధించిన సమాధానాలు ఈ ప్రశ్నపత్రంలోనే రాసి పార్టు – Aకు జత చేయాలి.

**III. భాషాంశాలు** $20 \times \frac{1}{2} = 10$

గీత గీసిన పదానికి సరైన జవాబును బ్రాకెట్లలో గుర్తించండి.

**13.** సురుచిర తారకా కుసుమశోభి. (అర్థాన్ని గుర్తించండి) ( )

A) చంద్రుడు B) నక్షత్రాలు C) సూర్యుడు D) గ్రహాలు

**14.** నవ సౌదామిని బోలు. (అర్థాన్ని గుర్తించండి) ( )

A) మెరుపు B) భ్రాంతి C) చీకటి D) తిమిరం

**15.** అమరావతి చిరకీర్తి సంపాదించింది. (పర్యాయ పదాలు గుర్తించండి) ( )

A) మెరుపు, వెలుగు B) ఖ్యాతి, యశస్సు

C) ఖ్యాతి, వెలుగు D) యశస్సు, మెరుపు

**16.** విరియు కైరవముల విపుల రంధ్రముల (పర్యాయ పదాలు గుర్తించండి) ( )

A) తామర, పద్మం B) పద్మం, కలువ C) కలువ, కుముదం D) కమలం, తామర

**17.** పతివ్రత (వ్యుత్పత్తిని గుర్తించండి) ( )

A) గృహాన్ని ధరించేది B) పురమును ధరించేది

C) పుణ్యవంతురాలు D) పతిని సేవించడమే నియమంగా పాటించేది

**18.** 'స్వభావం చేతనే ఐశ్వర్యం కలవాడు' (వ్యుత్పత్త్యర్థాన్ని గుర్తించండి) ( )

A) పుత్రుడు B) శ్రియఃపతి C) పరివ్రాజకుడు D) ఈశ్వరుడు

**19.** ఎట్టి శబ్దం చేయక అన్నం భక్షించింది. (వికృతి పదాన్ని గుర్తించండి) ( )

A) సద్దు B) శద్దు C) సాధు D) శపథం

**20.** బంధనాలు తొలగించమని శివాజీ ఆన ఇచ్చాడు. (ప్రకృతిని గుర్తించండి) ( )

A) అజ్ఞ B) ఆజ్ఞ C) ఆననం D) అణా

**21.** భవత్పన్నగ కుండలీ (నానార్థాలు గుర్తించండి) ( )

A) పాము, కప్ప B) పాము, ముంగీస C) పాము, నెమలి D) నెమలి, గద్ద

**22.** మనుషులు ఉండటానికి వాసం, శరీరం కప్పుకోవడానికి వాసం కావాలి. (నానార్థాలు గుర్తించండి) ( )

A) ఇల్లు, నివాసం B) నివాసం, సువాసం C) వస్త్రం, శరీరం D) ఇల్లు, వస్త్రం

**23.** పూరీలో 'జగన్నాథుడు' వెలిశాడు. (పదాన్ని విడదీయండి) ( )

A) జగన్ + నాథుడు B) జగత్తు + నాథుడు

C) జగమున + నాథుడు D) జగత్ + నాథుడు

**24.** 'పూరెమ్మ' (సంధిని గుర్తించండి) ( )

A) పడ్వాది సంధి B) పుంప్వాదేశ సంధి C) ప్రాతాది సంధి D) పూర్వరూప సంధి

**25.** 'నలు దెసలు' (సమాసాన్ని గుర్తించండి) ( )

A) ద్వంద్వ సమాసం B) ద్విగు సమాసం

C) అవ్యయీభావ సమాసం D) షష్ఠీ తత్పురుష సమాసం

**26.** 'అబ్జముల వంటి పాదములు' సమాస పదంగా ఏర్పడినట్లైతే ( )

A) అబ్జకరములు B) కరాబ్జములు C) పాదాబ్జములు D) ముఖాబ్జము

**27.** కిందివాటిలో సీస పద్య లక్షణాలను గుర్తించండి. ( )

A) 3 ఇంద్రగణాలు, 2 సూర్యగణాలు B) 5 సూర్యగణాలు

C) 1 సూర్యగణం, 4 ఇంద్రగణాలు D) 6 ఇంద్రగణాలు, 2 సూర్యగణాలు

**28.** ఆటవెలది, తేటగీతి పద్యాలకు యతిస్థానం ఎన్నో అక్షరం? ( )

A) 3వ గణం 1వ అక్షరం B) 4వ గణం 1వ అక్షరం

C) 10వ అక్షరం D) 5వ గణం 1వ అక్షరం

**29.** 'శార్దూలం' పద్యగణాలను గుర్తించండి. ( )

A) మసజసతగ B) మసజసతతగ C) మసజసతతగ D) మసజజసతగ

**30.** చంద్రికాంబోధియఖిలంబు (దీనిలోని అలంకారాన్ని గుర్తించండి) ( )

A) ఉపమాలంకారం B) అతిశయోక్తి అలంకారం

C) వృత్త్యనుప్రాసాలంకారం D) రూపకాలంకారం

**31.** 'ఉన్నదాని కంటే ఎక్కువ చేసి చెప్పడం'. ఏ అలంకార లక్షణం? ( )

A) అతిశయోక్తి అలంకారం B) ఉపమాలంకారం

C) అర్థాంతరన్యాసాలంకారం D) ఉత్ప్రేక్షాలంకారం

**32.** కిందివాటిలో స్వభావోక్తి అలంకారానికి ఉండే పద్య పాదాన్ని గుర్తించండి. ( )

A) ఆ-యేమీ యొక రాణీవాసమున్ పుణ్యావాసమున్ దెచ్చినావా?

B) అనుచున్ జేవురుమీలు కన్నుగవతో, నాస్పంద దోష్ఠంబుతో

C) అనల జ్యోతుల నీ పతివ్రతల బాపాచారులై డాయు భూ

D) జననీ! హైందవ భూమి నీ పగిది దుశ్చారిత్రముల్ సాగునే?

# జవాబులు

## పార్టు – A

**I. అవగాహన – ప్రతి స్పందన**

**1. కింది పద్యాల్లో ఒక దానికి ప్రతి పదార్థం రాయండి.**

అ) సురుచిరతారకాకుసుమశోభి నభోంగణభూమిఁ గాలమ
న్గరువపుసూత్రధారి జతనంబున దిక్పతికోటి ముందటన్
సరసముగా నటింపఁగ నిశాసతి కెత్తిన క్రొత్తతోఁపుఁబెం
దెర యన నొప్పె సాంధ్యనవదీధితి పశ్చిమదిక్తటంబునన్.

**జ: ప్రతిపదార్థం**

| | | |
|---|---|---|
| సురుచిర | = | చాలా అందమైన |
| తారకా | = | చుక్కల |
| కుసుమ | = | పూల (తో) |
| శోభి | = | మనోజ్ఞమైనదైన |
| నభః | = | ఆకాశమనే |
| అంగణభూమిన్ | = | రంగస్థలం (వేదిక)పై |
| కాలము + అన్ | = | కాలం అనే |
| గరువపు | = | గొప్ప |
| సూత్రధారి | = | సూత్రధారి (దర్శకుడు) |
| జతనంబున | = | ప్రయత్న పూర్వకంగా |
| దిక్పతికోటి | = | దిక్పాలకుల సమూహం |
| ముందటన్ | = | ముందు (ఎదుట) |
| సరసముగా | = | చక్కగా (యుక్తంగా) |
| నటింపగ | = | నాట్యం చేయడానికి సిద్ధపడిన |
| నిశాసతికిన్ | = | రాత్రి అనే స్త్రీకి |
| ఎత్తిన | = | నిలిపిన (పట్టిన) |
| క్రొత్త | = | కొత్తదైన |
| తోఁపున్ | = | ఎర్రని |
| పెన్ + తెర | = | పెద్ద తెర |
| అనన్ | = | అన్నట్లుగా |
| పశ్చిమ దిక్ + తటంబునన్ | = | పడమటి తీరంలోని (పడమటి దిక్కున) |
| సాంధ్య | = | సంధ్యకు సంబంధించిన (సంధ్యాకాలపు) |
| నవ దీధితి | = | కొత్త వెలుగు |
| ఒప్పెన్ | = | ప్రకాశించింది |

**(లేదా)**

www.eenadupratibha.net

ఆ) శివరాజంతట మేల్ముసుంగుc దెరలో స్నిగ్ధాంబుదచ్ఛాయలో
నవసౌదామినిc బోలు నా యవనకాంతారత్నమున్ భక్తి గౌ
రవముల్ వాటcగc జూచి పల్కె "వనితారత్నంబు లీ భవ్యహైం
దవభూజంగమ పుణ్యదేవతలు; మాతా! తప్పు సైరింపుమీ!"

జ: **ప్రతి పదార్థం**

| | | |
|---|---|---|
| శివరాజు | = | శివాజీ మహారాజు |
| అంతటన్ | = | అప్పుడు |
| మేల్ముసుంగు | = | సువాసినీ స్త్రీలు వేసుకునే మేలు ముసుగు యొక్క |
| తెరలోన్ | = | తెర లోపల |
| స్నిగ్ధ | = | దట్టమైన |
| అంబుద | = | మేఘం యొక్క |
| ఛాయలోన్ | = | నీడలో |
| నవసౌదామిన్ | = | కొత్త మెరుపు తీగను |
| పోలు | = | పోలినట్లు ఉన్న |
| ఆ, యవన కాంతారత్నమున్ | = | ఆ రత్నం లాంటి యవనకాంతను |
| భక్తి గౌరవముల్ | = | భక్తియునూ, గౌరవమునూ |
| పాలుగన్ + చూచి | = | స్ఫురించేలా చూసి |
| పల్కెన్ | = | ఈ విధంగా అన్నాడు |
| వనితారత్నంబులు | = | రత్నం లాంటి స్త్రీలు |
| ఈ | = | ఈ |
| భవ్య | = | శుభప్రదమైన |
| హైందవ భూ | = | భారత భూమిపై |
| జంగమ | = | సంచరించే |
| పుణ్యదేవతలు | = | పుణ్యప్రదమైన దేవతల లాంటివారు |
| మాతా | = | అమ్మా! |
| తప్పున్ | = | మా వారు చేసిన తప్పును |
| సైరింపుమీ | = | మన్నింపుము |

**2. కిందివాటిలో ఒక పద్యాన్ని పాద భంగం లేకుండా పూరించి, భావం రాయండి.**

అ) దెసలను కొమ్మలొయ్య......సముత్సుకాకృతిన్

జ: దెసలను కొమ్మ లొయ్య నతిదీర్ఘములైన కరంబులన్ బ్రియం
బెసcగcగ నూcది నిక్కి రజనీశ్వరుc డున్నతలీలc బేర్చు నా
కస మను పేరి భూరుహము కాంతనిరంతర తారకా లస
త్కుసుమ చయంబు గోయుటకొకో యనc బ్రాcకె సముత్సుకాకృతిన్.

**భావం:** దిక్కులనే కొమ్మలతో, వెలుగులీనే చుక్కలనే పువ్వులతో పెద్ద చెట్టులా కనిపిస్తుంది ఆకాశం. తన పొడవైన చేతులతో ఆ పువ్వులను అందుకునేందుకా అన్నట్లు చంద్రుడు విజృంభించాడు.

(చంద్రుడి కాంతి ఆకాశమంతా వ్యాపించింది అని అర్థం)

www.eenadupratibha.net

(లేదా)

**ఆ) ఆ-యేమీ? యొక.........యౌద్ధత్య మోర్వన్ జుమీ.**

జ: "ఆ-యేమీ? యొక రాణివాసమున బుణ్యావాసమున్ దెచ్చినా
వా? యేహైందవుఁడైన నీ గతి నమర్యాదన్ బ్రవర్తించునే?
మా యాజ్ఞన్ గమనింపవో? జయ మదోన్మాదంబునన్ రేఁగి, నీ
యాయుస్సూత్రము లీవ త్రుంచుకొనెదో? యౌద్ధత్య మోర్వన్ జుమీ"

**భావం:** ఆ... ఏమిటి? పుణ్యానికి నిలయమైన ఒక రాణివాసాన్ని బందీగా తెచ్చావా? ఏ హైందవుడైనా ఈ విధంగా మర్యాద తప్పి ప్రవర్తిస్తాడా? నా ఆజ్ఞను నీవు గమనించలేదా? విజయగర్వం మత్తులో చెలరేగి నీ ప్రాణానికి నీవే ఆపద తెచ్చుకుంటావా? నీవు చేసిన ఈ పనిని నేను సహించను.

**కింది పరిచిత గద్యాన్ని చదివి, ప్రశ్నలకు జవాబులు రాయండి.**

అర్థములు నిత్యములు కావు. యౌవనం ఝురీవేగ తుల్యం. జీవనం బుద్బుద ప్రాయం. కాబట్టి బుద్ధిమంతుడు సత్వరంగా ధర్మంను సమాచరింపవలెను. సమాచరింపనివాడు పశ్చాత్తాపం బొంది శోకాగ్ని సంతప్తుడగును. నీవతి సంచయము చేసితివి. దాని దోషమిది. కాబట్టి యతి సంచయేచ్ఛ తగదు. ఒరులకిచ్చి తాను భుజించినదే తన సొత్తు. పరులకీక తానుగుడవక కూడబెట్టిన ద్రవ్యం చచ్చిన తటి వెంటరాబోదు.

ప్రశ్నలు:

**3. బుద్ధిమంతుడు దేన్ని ఆచరించాలి?**

జ: బుద్ధిమంతుడు ధర్మాన్ని ఆచరించాలి.

**4. దేన్ని తనసొత్తుగా భావించాలి?**

జ: ఒరులకిచ్చి తాను భుజించినదే తన సొత్తు.

**5. మనిషి మరణించాక వెంటరానిది ఏది?**

జ: పరులకీక తాను గుడవక కూడబెట్టిన ద్రవ్యం చచ్చిన తర్వాత వెంటరాదు.

**6. పై పేరా ఆధారంగా ఒక ప్రశ్న తయారు చేయండి.**

జ: యౌవనం ఎటువంటిది?

**II. స్వీయ రచన**

**7. ధన్యుడు పాఠ్యభాగ రచయిత గురించి మీకు తెలిసిన విషయాలు రాయండి.**

జ: **ధన్యుడు పాఠ్యభాగ రచయిత గురించి మాకు తెలిసిన విషయాలు:**

ధన్యుడు పాఠ్యభాగ రచయిత పరవస్తు చిన్నయసూరి. ఈయన తెలుగు, తమిళ, సంస్కృతాంధ్ర భాషల్లో మంచి పండితుడు. అక్షరగుచ్ఛం, నీతి చంద్రిక, బాల వ్యాకరణం రచించాడు. నీతి చంద్రిక, బాల వ్యాకరణాలు లక్ష్య – లక్షణ గ్రంథాలుగా ప్రసిద్ధి పొందాయి.

**8. శివాజీ సోన్‌దేవుని పట్ల ఎందుకు ఆగ్రహంతో ఉన్నాడు? ఏమన్నాడు?**

జ: శివాజీ సోన్‌దేవునిపై ఆగ్రహంగా ఉండటానికి కారణం కళ్యాణి దుర్గాన్ని జయించిన సోన్‌దేవుడు ఆ రాజ్య సర్దారును, రాణీవాస స్త్రీలను బంధించి తేవడం. శివాజీ సోన్ దేవునితో 'ఏ హైందవుడైనా ఈ విధంగా స్త్రీల పట్ల అగౌరవంగా ప్రవర్తిస్తాడా? నా ఆజ్ఞను గమనింపవా? విజయగర్వంతో నీ ఆయుస్సూత్రం నీవే తెంచుకుంటావా?' అని శివాజీ ఆగ్రహించాడు.

**9. వెన్నెల పాఠం నేపథ్యాన్ని రాయండి.**

జ: **వెన్నెల నేపథ్యం**

హిరణ్య కశిపుడు వనవిహారం చేసిన సందర్భంలో సాయం సమయాన్ని, చంద్రోదయాన్ని వర్ణించడం ఈ పాఠ్య నేపథ్యం. ప్రకృతిలో వచ్చిన మార్పులను రమణీయంగా కవి వర్ణించాడు.

**10. కాలం విలువైందని ఎలా చెప్పగలరు?**

జ: **కాలం విలువ:** కాలం గడిచిపోయాక తిరిగిరాదు. ధనాన్ని, సంపదలను తిరిగి సంపాదించుకోవచ్చు. కానీ గడిచిపోయిన కాలాన్ని తిరిగి సంపాదించుకోలేం. ప్రపంచంలో అత్యంత విలువైంది కాలమే. అందుకే పనులు వాయిదా వేయకుండా ఎప్పటి పనులు అప్పుడే చేసుకోవాలి.

**11. లోచనంబులకు నమృతసేచనంబును, శరీరంబునకు జందనా సారంబు నందించిన వెన్నెల ఎలా విస్తరించిందో రాయండి.**

జ: పాలకడలి గర్భం నుంచి పుట్టిన వెన్నెల ఉప్పెనలా విజృంభించి దిక్కులన్నీ ముంచెత్తింది. అప్పుడు చంద్రబింబం ఆదిశేషుని పానుపులాగా కనిపిస్తూ ఉంది. అందులోని మచ్చ కన్నులకు విష్ణువులా కనిపిస్తూ అలరిస్తుంది. (కవి భావనావిస్తృతి ఎంత గొప్పగా ఉందో ఈ పద్యం తెలియజేస్తుంది)

ఆ నిండు వెన్నెల్లో కలువపూల సమూహపు రేకులు వేగంగా విచ్చుకున్నాయి. వాడిపోయిన కేసరాలు చిగురించాయి. పుప్పొడిపై తేనెలు పొంగి తరంగాల్లా విజృంభించి, తమపైకి వస్తున్న తుమ్మెదల బృందానికి పండుగ చేశాయి. ఆ నిండు వెన్నెల్లో, కొత్త పరిమళాలతో పరిసరాలను కలువలు సంతోషభరితం చేశాయి.

ప్రశంసమానుడైన చంద్రుడు తన వెన్నెల వర్షంతో మెత్తని చంద్రకాంత శిలలను కరిగిస్తూ, విహరిస్తున్న చకోర పక్షుల రెక్కలను స్పృశిస్తూ (దాటుతూ); విచ్చుకుంటున్న కలువపూల రంధ్రాలను నింపి, తనవైపు తిప్పుకుంటూ అందమైన స్త్రీల అద్భుతమైన చిరునవ్వుల తెల్లని కాంతి తరంగాలను పెంపుచేస్తూ, అంతకంతకూ అధికమై, పొంగి, పొంగి, దిశలన్నీ ముంచెత్తుతూ, సమస్తాన్నీ ఆ వెన్నెల అనే సముద్రపు నీటితో నింపుతూ నిండుగా ఆవిర్భవించాడు.

ఈ విధంగా వెన్నెల చాలా అందంగా, గంభీరంగా, సమున్నతంగా విస్తరించింది. అది రాత్రి అనే ఆలోచన రానీయక, చీకటి అనే పేరును విననీయక, అవ్యక్తం అనే అనుమానాన్ని తలెత్తనీయక, కళ్లకు అమృతపు జల్లులా, శరీరానికి మంచిగంధంలా, మనసుకు ఆనంద తరంగంలా విజృంభించింది.

**(లేదా)**

ప్ర. **మాతృభావన పాఠం ఆధారంగా శివాజీ వ్యక్తిత్వాన్ని విశ్లేషించండి.**

జ: **ధర్మమూర్తి:** శివాజీ ధర్మప్రభువు. శత్రు దుర్గాలను జయించినప్పుడు అక్కడి స్త్రీలను అవమానించకూడదని, గోబ్రాహ్మణులకు హానిచేయరాదని తన సర్దారులను ఆజ్ఞాపించాడు.

**తప్పుచేస్తే శిక్ష:** అబ్బాజీ సోన్ దేవుడు కళ్యాణి దుర్గ అంతఃపుర స్త్రీని బంధించి తెచ్చినందుకు కోపించి అతడి ప్రాణాలు తీస్తానని హెచ్చరించాడు.

**స్త్రీలపై గౌరవం ఉన్నవాడు:** పతివ్రతలు భూ లోకంలో తిరిగే దేవతలని, భారత భాగ్య కల్పలతలని శివాజీ అభిప్రాయం. స్త్రీలు అగ్నిజ్వాల లాంటి వారని, వారికి హాని చేస్తే రావణుడిలా ధ్వంసం అవుతారని శివాజీ భావన.

**తప్పును సరిదిద్దడం:** ధర్మ ప్రభువైన శివాజీ, యవన కాంతను తన మాతృమూర్తిగా గౌరవించి, సన్మానించి; కళ్యాణి సర్దారును మంచి మాటలతో ఆదరించి, బీజాపురం పంపిన సహృదయుడు.

**12. 'పల్లెటూళ్ల ప్రశాంత జీవన సౌఖ్యానికి పుట్టినిళ్లు'. దీన్ని సమర్థిస్తూ రాయండి.**

జ: పల్లెజీవితం ప్రశాంతంగా ఉంటుంది. గాలి, ఎండ ప్రతీ ఒక్కరికీ లభిస్తుంది. పచ్చని పొలాలు కలకలలాడుతూ, గాలికి తలలాడిస్తూ గ్రామ ప్రజలను సుఖసంతోషాలతో ముంచెత్తుతాయి. పాడి పంటలు ఉంటాయి. పొయ్యి కిందికి, పొయ్యి మీదకు కావాల్సినవి వారికి అక్కడే దొరుకుతాయి. గ్రామంలో చేతివృత్తుల వారు ఒకర్ని ఒకరు అన్నదమ్ముల్లా భావిస్తూ పరస్పరం సహాయం చేసుకుంటారు. పల్లెల్లో సంక్రాంతికి ముగ్గులు, గొబ్బిళ్లు, భోగి మంటలు, సంక్రాంతి ప్రభలు, తీర్థాలు సాగుతాయి. హరిదాసులు, గంగిరెద్దులు, పగటి వేషధారుల పాటలూ ఆనందాన్ని ఇస్తాయి. గ్రామీణులు ఆనందంగా నవ్వుతూ ఒకరిని ఒకరు బంధుత్వంతో పలకరించుకుంటూ, కష్టసుఖాల్లో పాలుపంచుకుంటారు. గ్రామాలు పాడిపంటలకు నిలయాలు. అవి ప్రకృతి రమణీయతకు పుట్టిళ్లు.

**(లేదా)**

ప్ర. **అమరావతి శిల్పకళలకు నిలయమని ఎలా చెప్పగలవు?**

జ: **అమరావతి శిల్పకళలకు నిలయం**

అమరావతి అద్భుతమైన శిల్పకళలకు కాణాచి. అశోకుడు నిర్మించిన మహా బౌద్ధ స్తూపానికి ఆచార్య నాగార్జునుడు మహా ప్రాకారాన్ని నిర్మించాడు. కృష్ణానది పరీవాహక ప్రాంతంలోని నాగార్జునకొండ, దంతగిరి, నేలకొండపల్లి, ధూళికట్ట, భట్టిప్రోలులాంటి ప్రదేశాల్లో లభించిన బౌద్ధ శిల్పాలను అమరావతి స్కూల్ ఆఫ్ ఆర్ట్ అని పిలుస్తారు. ఎన్నో శిల్పాలు కాలగర్భంలో కలిసిపోగా మరికొన్ని ఇతర దేశాలకు తరలిపోయాయి.

అజంతా, ఎల్లోరా శిల్పాలు కూడా అమరావతి శైలిలోనే ఉన్నాయని పురావస్తు శాఖ గుర్తించింది. అమరావతి శిల్పంలో ఆనందం, క్రోధం, విషాదం, కరుణ, దయ, ప్రేమ లాంటి భావాలు స్పష్టంగా కనిపిస్తాయి.

## పార్టు - B

III. **భాషాంశాలు:** 13-B; 14-C; 15-B; 16-C; 17-D; 18-D; 19-A; 20-B; 21-C; 22-D; 23-D; 24-C; 25-B; 26-C; 27-D; 28-B; 29-C; 30-D; 31-A; 32-B.

*రచయిత:* ***కొంపల్లి లీలాకుమార్***

www.eenadupratibha.net